# సి.పి.ఐ.(ఎం-ఎల్) కృష్ణాజిల్లా సీనియర్ నాయకులు కా॥ టి. పూర్ణచంద్రరావు సంస్మరణ సభ



సంస్మరణసభలో ప్రసంగిస్తున్న కా॥డివిఎన్ స్వామి; వేదికపై ఇతర వక్తలు

**విజయవాడ, 8-11-20 :**

**కా॥** తరిమెల నాగిరెడ్డి రూపొందించిన విప్లవ పంథా పట్ల అచంచలమైన విశ్వాసంతో సుదీర్ఘకాలం సి.పి.ఐ.(ఎం-ఎల్) కృష్ణాజిల్లా కమిటీ సభ్యునిగా, విజయవాడ టౌన్ కమిటీ కార్యదర్శిగా కొనసాగిన కామ్రేడ్ తంబాబత్తుల పూర్ణచంద్రరావు తన 80వ ఏట దీర్ఘకాల అనారోగ్యానికి తోడు కరోనా బారిన పడటంతో 26-10-2020న మృతి చెందారు. ఆ కామ్రేడ్‌ను స్మరించుకుంటూ సి.పి.ఐ.(ఎం-ఎల్) కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యాన విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో 8-11-2020న సంస్మరణ సభ జరిగింది. ముందుగా ఓ.పి.డి.ఆర్. రాష్ట్ర అధ్యక్షులు సుదీర్ఘకాలంగా కా॥ పూర్ణగారితో వివిధ ఆందోళనల సందర్భంగా కలిసి పనిచేసిన కా॥ ఏసుగారు పూర్ణగారి చిత్రపటానికి దండ వేసి నివాళులర్పించిన అనంతరం సంతాపసూచకంగా సభ రెండు నిముషాలు మౌనం పాటించింది.

సంతాప సభకు అధ్యక్షత వహించిన సి.పి.ఐ.(ఎం-ఎల్) కృష్ణాజిల్లా నాయకులు కా॥ వీరబాబు మాట్లాడుతూ కా॥ పూర్ణగారితో తనకున్న ఉద్యమానుభవాల్ని తలచుకున్నారు. బాల్యం నుండి ఆ కామ్రేడ్‌కు కమ్యూనిస్టుపార్టీ పట్ల గౌరవాభిమానాలున్నాయని ఆ కామ్రేడ్ జీవితంలోని వివిధ సంఘటనలను పేర్కొన్నారు. బాల్యం నుండి వృద్ధాప్యం వరకు ఆయన అనేక పోలీసు కేసులను, రౌడీ మూకల నుండి దాడులను ఎదుర్కొన్నారని అన్నారు. గిరిపురం, అరుల్‌నగర్, మాచవరంలలో పేదల ఇళ్ళ స్థలాల కోసం జరిగిన ఆందోళనల్లో కా॥ పూర్ణగారు ఎంతో మిలిటెంట్‌గా పాల్గొన్నారని, ఆ సందర్భంగా జరిగిన రౌడీమూకల దాడులను సమర్ధంగా తిప్పికొట్టి ఆందోళన చేస్తున్న ప్రజానీకంలో ఆత్మవిశ్వాసాన్ని నింపాడన్నారు. శ్రామికునిగా జీవితం ప్రారంభించి, తన మిలిటెన్సీతో ఉద్యమాలకు అండగా నిలిచాడన్నారు. అతివాదం, మితవాదం రెండూ కూడా విప్లవానికి హాని కలిగిస్తాయని, కార్యకర్తలు వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తూ ఉండేవారని ఆయన గుర్తు చేసుకున్నారు.

సి.పి.ఐ.(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ డి.వి.ఎన్. స్వామి మాట్లాడుతూ మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానం పట్ల అచంచలమైన విశ్వాసంతో నిబద్ధతతో కా॥ పూర్ణచంద్రరావు పనిచేశారని అన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా నమ్మిన పంథాను వీడకుండా నిర్మాణాన్ని కనిపెట్టుకుని ఉన్నారని అన్నారు. సి.పి.ఐ.(ఎం-ఎల్) నాయకులు కా॥ ఎం. భార్గవశ్రీ మాట్లాడుతూ కా॥ పూర్ణగారి జీవిత ఘట్టాలనేకం గుర్తుచేశారు. నమ్మిన ఆశయం పట్ల, పార్టీ పట్ల అచంచల విశ్వాసం కలిగి ఉన్న కామ్రేడని కొనియాడారు. కా॥ పూర్ణగారి జీవిత భాగస్వామి కా॥ అరుణమ్మ, సీడ్స్ కంపెనీలో కార్మికురాలుగా పనిచేస్తూ, కా॥ పూర్ణగారి కార్యక్రమాలకు అన్నివేళలా అండదండగా నిలిచారని ఆయన గుర్తుచేశారు.

సి.పి.ఐ.(ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు కా॥ ఎల్. కుటుంబరావు, సి.పి.ఐ.(ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు కా॥ పి. ప్రసాదరావు వివిధ ఐక్య కార్యాచరణల సందర్భంగా కా॥ పూర్ణగారితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. ఇంకా ఆ కామ్రేడ్‌తో సుదీర్ఘకాలం అనుబంధం కలిగిన జనసాహితి రాష్ట్ర అధ్యక్షులు దివికుమార్, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు డా॥ విజయ, అడ్వకేట్ రాంప్రసాద్, ప్రజా నాట్యమండలి పిచ్చయ్య, మీసాల ఏడుకొండలు, తదితరులు ఆ కామ్రేడ్‌తో తమకు గల అనుభవాలను గుర్తు చేసుకున్నారు. కా॥ పూర్ణాగారి కుమార్తె వాసంతి, కొడుకు క్రాంతి ఇంకా ఇతర కుటుంబ సభ్యులు, సి.పి.ఐ.(ఎం-ఎల్) శ్రేణులు, అభిమానులు పలువురు ఈ సంతాపసభలో పాల్గొన్నారు.

★ ★ ★